నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 4 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL


## టీజీపీఎస్సీ ఏఈఈ ఫలితాల్లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రభంజనం

బాసర, ఆగస్టు 3 : ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీ ఏఈఈ ఫలితాల్లో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు వీసీ వెంకటరమణ తెలిపారు. ట్రిపుల్ ఐటీలో 2019, 2020, 2021 సంవత్సరాల్లో చదువు పూర్తి చేసుకున్న 50 మంది విద్యార్థులకు పైగా ఎంపికయ్యారన్నారు. శనివారం వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎస్సీ కేటగిరీలో స్టేట్ మొదటి ర్యాంకును ట్రిపుల్ ఐటీ విద్యార్థి సూర్యతేజ సాధించనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శాంతి జగదీశ్వరికి, అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సూర్యతేజ

## జైల్ అదాలత్ ఖైదీలకు ఉపయోగపడుతుంది

### ప్రథమ శ్రేణి న్యాయమూర్తి దుర్గారాణి


జైల్ అదాలత్‌లో పాల్గొన్న ప్రథమ శ్రేణి న్యాయమూర్తి దుర్గారాణి

ఎదులాపురం, ఆగస్టు 3 : సత్వర న్యాయ సాయం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న జైల్ అదాలత్ ఖైదీలకు చాలా దోహదపడుతుందని ప్రథమ శ్రేణి న్యాయమూర్తి దుర్గారాణి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్ర జైలులో జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు ఖైదీలకు సంబంధించి నాలుగు కేసులను పరిష్కరించారు. ఖైదీలకు సత్వర న్యాయ సాయం అందించేందుకు జైల్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ దాసరి గంగారాం, ఆరుగుల అశోక్, ఉమేశ్‌రావు డోలే, పర్యవేక్షణాధికారి అశోక్ కుమార్, డిప్యూటీ పర్యవేక్షణాధికారులు జయప్రకాశ్‌రెడ్డి, సిబ్బంది శశికళ, భాస్కర్, రవీందర్, శ్రావ్య, శ్యామ్ పాల్గొన్నారు.


బుక్ రిలీజ్ చేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా, అధికారులు

## విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా చూడాలి

ఉట్నూర్, ఆగస్టు 3 : ప్రతి ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థి ఆంగ్లంలో సులభంగా మాట్లాడేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంగ్ల భాషా నైపుణ్యానికి స్పోకెన్ ఇంగ్లిష్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 133 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో జగన్, జీసీడీవో చాయ, రిసోర్స్ పర్సన్‌లో గోవింద్‌రావు, శంకర్, దేవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

## ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ఎదులాపురం, ఆగస్టు 3 : ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిఠల్ అన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు-2024పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ www.ccla.telangana. gov.in వెబ్ సైట్ ద్వారా అవకాశం కల్పించామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తహ సీల్దార్, ఆర్డీవో స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను తిరస్కరిస్తే, అందుకు గల కారణాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ శ్యామలా దేవి, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీవోలు వినోద్‌కుమార్, జీవాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలు తెలియజేయాలి..

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3 : ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిఠల్ అన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈనెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పెండింగ్ ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్న కల్యాణి, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.


ఘన్‌పూర్ జలపాతం

## ఘన్‌పూర్ జలపాతం కనువిందు

*తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఘన్‌పూర్ గ్రామ సమీపంలో ఉన్న జలపాతం ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. ఘన్‌పూర్ సరిహద్దు నుంచి కేవలం కిలోమీటరున్నర దూరంలో అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. దీనిని చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.* - బోథ్, ఆగస్టు 3

## గాయత్రి జల సవ్వడి

*ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గాయత్రి జలపాతానికి జలకళ సంతరించుకున్నది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు, జలపాతాలు పొంగి పొర్లుతున్నాయి. గాయత్రి జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. ఈ జలపాతం 350 అడుగుల ఎత్తు నుంచి నీరు జాలువారుతుండడంతో వరల్డ్ వాటర్ రాపెల్లింగ్ పోటీలకు అనుకూలంగా ఉంది.*

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 3


జలువారుతున్న గాయత్రి జలపాతం

# పైసలు కడితేనే ఎల్ఆర్ఎస్

## ఫీజులు లేకుండా ఫ్రీగా పరిష్కరిస్తామని చెప్పి మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్

- ఆగస్టులో మొదలుపెట్టి రానున్న మూడు నెలల్లో పూర్తి చేసేందుకు సన్నాహాలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కోట్ల రూపాయల వసూలుకు రంగం సిద్ధం
- ఉచితంగా చేస్తారని ఆశపడిన పేదలు, సామాన్యులకు భారంగా మారిన సర్కారు నిర్ణయం
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు మార్గదర్శకాలు జారీ

మంచిర్యాల, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సర్కారు సిద్ధమైంది. ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తూ అభాసుపాలవుతున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ఉచితంగా చేయాలంటూ నానా యాగీ చేశారు. అడ్డగోలు ప్రకటనలు ఇచ్చి జనాలను బోల్తా కొట్టించారు. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరిస్తామని ప్రకటనలు ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ సర్కారు ఫీజు తీసుకుని క్రమబద్ధీకరణ చేస్తామని చెప్తే పేదలు, సామాన్యుల రక్తం తాగుతున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామంటూ బీరాలు పలికారు. ఇప్పుడు సీన్ మారింది. అప్పుడు ఎల్ఆర్ఎస్ ఫ్రీ అన్న నేతలందరూ ఇప్పుడు మంత్రులయ్యారు. ఫీజులు లేకుండా ఉచితంగా చేస్తామన్న ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చి ఇప్పుడు పైసలు కడితేనే ఎల్ఆర్ఎస్ చేస్తామంటున్నారు. ఎల్ఆర్ఎస్ పేరిట కోట్ల రూపాయల వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. పేదలు, సామాన్యులంటూ ముసలి కన్నీరు కార్చి ఇప్పుడు ఎల్ఆర్ఎస్ పేరిట రూ.25 వేల కోట్లు రాబట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 12 మున్సిపాలిటీల్లో 87 వేల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం వచ్చాయి. గ్రామ పంచాయతీల్లో వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిన్నింటినీ క్రమబద్ధీకరిస్తే కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరనున్నాయి. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం సంగతి ఎలా ఉన్నా.. మొన్నటి వరకు ఫ్రీగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పి ఇప్పుడు ఫీజులు కట్టాల్సిందే నంటూ మాట మార్చడంతో పేదలు, సామాన్యులపై భారం పడనుంది.

### నాలుగేళ్లుగా ఎదురుచూపులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్-2020 పేరిట గత సర్కారు దరఖాస్తులను స్వీకరించింది. నాలుగేళ్ల క్రితం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలలపాటు ఓపెన్ ప్లాట్లు, నాన్ లే-అవుట్‌లకు సంబంధించి దరఖాస్తుదారులు రూ.1000 ఫీజు చెల్లించి డాక్యుమెంట్స్ సమర్పించారు. పెద్ద లే అవుట్‌లకు రూ.10 వేలు దరఖాస్తు ఫీజు తీసుకున్నారు. కొన్నింటిని పరిష్కరించగానే కోర్టు కేసులతో ప్రక్రియ నిలిచింది. దీంతో ఇప్పుడు కోట్ల రూపాయల ఆదాయమార్గంగా కనిపిస్తున్న ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ సర్కార్ కన్ను పడింది. ఎట్టి పరిస్థితుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. అవసరమైతే వేరే డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను వాడుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది.

### నాలుగు దశల్లో ప్రాసెస్..

తొలి దశలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సిస్టమ్ బేస్డ్ డేటాను అనుసరించి ఫిల్టర్ చేస్తారు. సర్వే నంబర్లవారీగా వాటిని క్లస్టర్లుగా డివైడ్ చేస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నా, కావాల్సిన డాక్యుమెంట్లు అన్నీ సమర్పించకపోయినా దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తారు.

- రెండో దశలో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, పంచాయతీ అధికారుల టీమ్ ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తుంది. వారికి మాత్రమే లాగిన్ ఉన్న యాప్‌లో సంబంధిత ఆస్తి నాలాలు, చెరువులు, కుంటలు, హెరిటేజ్ ప్రాపర్టీ, శిఖం, దేవాదాయ, ఇనాం భూములు, కోర్టు కేసుల్లో ఉన్నాయా లేదా పరిశీలించి అభ్యంతరాలుంటే నమోదు చేస్తారు.
- లెవల్-2లో అర్హత సాధించిన దరఖాస్తులను పరిశీలిస్తారు. సంబంధిత ప్లాట్ లేదా లే అవుట్‌కు రోడ్లు ఎంత వెడల్పుతో ఉన్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం చేశారా లేదా, ఓపెన్ స్పేస్ ఎంత ఉంది. తదితర సాంకేతిక అంశాలను వెరిఫై చేస్తారు. అన్ని కరెక్ట్‌గా ఉన్నాయని సీపీవో లేదా టీపీవో అధికారులు నిర్ధారిస్తారు. అనంతరం అవసరమైన పత్రాలు సమర్పించడంతోపాటు ఫీజు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తారు.
- చివరి దశలో అన్ని రకాల అర్హతలు సాధించిన దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ల స్థాయిలో తుది నిర్ణయం వెలువడుతుంది. క్రమబద్ధీకరించిన, రిజెక్ట్ చేసినా సిస్టమ్‌లో అవి ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతాయి. ఇలా నాలుగు దశల్లో ఎక్కడ జరగాల్సిన పని అక్కడ నిబంధనల ప్రకారం అయిపోతూ ఉంటుంది.



### మూడు నెలల్లో పూర్తి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. 2020లో ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు తీసుకున్నప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 87,021 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 36,239 అప్లికేషన్లను ప్రాసెస్ చేయగా 1838 రిజెక్ట్ అయ్యాయి. 11,094 దరఖాస్తులు షాట్‌పాల్ అయ్యాయి. 3363 దరఖాస్తులను ఫీజు చెల్లించాలంటూ లెటర్లు ఇచ్చారు. 127 అప్లికేషన్లకు ఫైనల్ అప్రూవుడ్ ప్రొసిడింగ్స్ ఇచ్చారు. వీటితో ప్రభుత్వానికి రూ.38,14,362 ఆదాయం వచ్చింది. ఇక వచ్చిన దరఖాస్తులన్నింటనీ పరిష్కరిస్తే కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరనున్నాయి.


**మున్సిపాలిటీలవారీగా 2020లో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు..**

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు | ప్రాసెస్ చేసినవి | రిజెక్ట్ చేసినవి | షార్ట్‌ఫాల్స్ | ఫీజు చెల్లింపు లెటర్లు వచ్చినవి | ఫైనల్ అప్రూవల్ పొసిడింగ్స్ వచ్చినవి |
|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 19,430 | 7,448 | 17 | 2,781 | 1,847 | 63 |
| కాగజ్‌నగర్ | 1,850 | 1,801 | 15 | 1,565 | 170 | 28 |
| మంచిర్యాల | 23,301 | 9,224 | 1,589 | 835 | 354 | 13 |
| బెల్లంపల్లి | 415 | 411 | 6 | 81 | 284 | 2 |
| మందమర్రి | 22 | 17 | 13 | 2 | 0 | 0 |
| చెన్నూర్ | 1,321 | 1,309 | 6 | 660 | 24 | 4 |
| నస్పూర్ | 4,921 | 4,516 | 8 | 30 | 339 | 3 |
| క్యాతన్‌పల్లి | 7,111 | 2,329 | 71 | 264 | 222 | 6 |
| లక్షెట్టిపేట | 2,163 | 564 | 11 | 108 | 6 | 0 |
| నిర్మల్ | 15,515 | 4,765 | 99 | 2,950 | 95 | 8 |
| బైంసా | 9,044 | 2,593 | 0 | 1,484 | 16 | 0 |
| ఖానాపూర్ | 1,928 | 1,262 | 3 | 334 | 6 | 0 |
| మొత్తం | 87,021 | 36,239 | 1,838 | 11,094 | 3,363 | 127 |

## చేలలో నీరు.. రైతన్న కన్నీరు

- అధిక వర్షాలతో పంట ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం
- ఆదిలాబాద్ జిల్లాలో సాధారణం కంటే అధిక వర్షపాతం
- వాతావరణం చల్లగా ఉండడం వల్ల సాగుపై ప్రభావం
- మరో వారం రోజులు ఇలాగే ఉంటే రైతుల భారీగా నష్టపోయే అవకాశం

ఆదిలాబాద్, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా అధిక వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. 20 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలను నష్టపోవాల్సిన దుస్థితి నెలకున్నది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటల ఎదుగుదల నిలిచిందని, దిగుబడిపై ప్రభావం పడుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వానకాలంలో 5.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో అధికంగా పత్తి, సోయా, కంది వేశారు. జూన్ మొదటి, రెండో వారంలో విత్తనాలు వేయగా వర్షాలు పడడంతో పంటల ఎదుగుదల బాగా కనిపించింది. దీంతో రైతులు సాగుపై ఆశలు పెట్టుకున్నారు. కాగా.. మూడు వారాలుగా కురుస్తున్న వానలు రైతుల పాలిట శాపంగా మారాయి. అధిక వానల వల్ల చేలలో నీరు నిలిచి, పంటల ఎదుగుదల నిలిచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎండ కాయకపోవడం, వాతావరణం చల్లగా ఉండడం వల్ల సాగుపై ప్రభావం చూపుతున్నదని అన్నదాతలు అంటున్నారు.


ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వీలోని పత్తి చేలలో నిలిచిన వర్షం నీరు

### సాధారణం కంటే అధిక వర్షపాతం

వానకాలంలో ఇప్పటి వరకు వరకు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. గురువారం వరకు 560.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 680.7 మిల్లీ మీటర్ల వర్షం పడింది. ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో చాలా ఎక్కువ, మిగతా మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలోని సాత్నాల, మత్తడి ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా, చెరువులు నిండాయి. పత్తి, సోయా చేలలో కలుపు బాగా పెరగడంతో నల్లరేగడి భూముల ఫలితంగా కలుపు తీయలేని పరిస్థితి ఉంది. దీంతో రైతులు గడ్డిమందు వాడుతున్నారు. అధిక గడ్డిమందు వినియోగం కారణంగా దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతు సంఘాల నేతలు అంటున్నారు. మరో వారం రోజులు వాతావరణం ఇలాగే ఉంటే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం నెలకున్నది.

### వానలతో కూలీల రేట్లు పెరిగాయ్..



*తాంసి, ఆగస్టు 3 : ఇర్వై దినాల సంది ఆనలు పడుతున్నయ్. ఈ ఆనలకు పత్తులు అస్సలు పెరుగత లేవ్. భూములు జాక్(తేమ) అయి గడ్డి మస్తు మొలిసింది. గడ్డి కలుసుడుకు కూలీలు దొరుకుత లేరు. మా ఊళ్లో కూలీలు మస్తు పైసలు అడుగుతున్నరు. ఒక మునుము(రెండు సాల్లు) కలుపు కలవాలంటే రూ.200 ఇత్తనే అత్తనంటున్నరు. ఇంకెన్ని దినాలు ఆనలు పడతయో ఏమో. మస్తు పరేషాన్‌గా ఉంది. పంట చేతికస్తుందో రాదో ఏం అర్థం కావడం లేదు.*

**- సోమ శంకర్‌రెడ్డి, రైతు, జామిడి, తాంసి మండలం.**

## మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

- ప్రభుత్వ భూములను రక్షించాలి..
- నిబంధనల ప్రకారమే భూముల క్రమబద్ధీకరణ
- వీసీలో రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ఎదులాపురం, ఆగస్టు 3 : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌లను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై శనివారం భూపాలపల్లి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి ఆ జిల్లా కలెక్టర్ కా ర్యాలయం నుంచి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం భూముల క్రమబద్ధీకరణ జరగాలని, అక్రమాలకు తావులేకుండా ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని అన్నారు. గత ప్రభుత్వం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31, 2020 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించింది. ఈ సమయంలో 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌లు, స్థానిక సంస్థల కా ర్యాలయాల్లో సహాయ కేంద్రాలు (హెల్ప్ డెస్క్)లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వీసీలో కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో 19 వేల దరఖాస్తులు వస్తే 7 వేలను పరిష్కరించామని ఇంకా 12 వేలు పరిష్కరించే దశలో ఉన్నాయని తెలిపారు. పంచాయతీ పరిధిలో 9,114 దరఖాస్తులు ఉన్నాయని, వీటిని మూడు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించి బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, పంచాయితీ అధికారి శ్రీలత, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

### క్రమబద్ధీకరణ చేపట్టండి..

నిర్మల్ అర్బన్, ఆగస్టు 1 : ఎల్ఆర్ఎల్ ద్వారా భూముల క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పురపాలన ప్రధాన కార్యదర్శి కిశోర్‌తో కలిసి కలెక్టర్లతో భూముల క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడుతూనే అనుమతి లేని లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

## నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిగా రాజేందర్

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 3 : నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్య అధికారిగా డాక్టర్ రాజేందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్‌కు సాధారణ బదిలీల్లో భాగంగా సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. నిర్మల్ జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారిగా పనిచేస్తున్న రాజేందర్‌ను ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారిగా నియమిస్తూ కలెక్టర్ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శనివారం జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.